శుక్రవారం ఎర్రవల్లిలో బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావుతో సమావేశమైన ఎంపీలు కే కేశవరావు, నామా నాగేశ్వరరావు, కేఆర్ సురేశ్‌రెడ్డి, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, పసునూరి దయాకర్, మాలోత్ కవిత, పోతుగంటి రాములు, బడుగుల లింగయ్య యాదవ్, వెంకటేశ్ నేతకాని, సంతోష్‌కుమార్, వద్దిరాజు రవిచంద్ర, జీ రంజిత్‌రెడ్డి, బీబీపాటిల్, పార్థసారథిరెడ్డి. చిత్రంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావు

తెలంగాణ హక్కులకు మనమే రక్ష

మొదటిపేజీ తరువాయి...

చేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదని గుర్తుచేశారు. నాడైనా నేడైనా తెలంగాణ హక్కులకు భంగం వాటిల్లకుండా కాపాడలవలసిన బాధ్యత బీఆర్ఎస్ ఎంపీలదేనని స్పష్టంచేశారు. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం శుక్రవారం ఎర్రవెల్లి నివాసంలో కేసీఆర్ అధ్యక్షతన జరిగింది. దాదాపు మూడు గంటలపాటు సాగిన సమావేశంలో పార్లమెంటు సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. 'తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకున్నదే నదీ జలాలకోసం. వాటిలోనే అన్యాయం జరిగితే ఇక్కడి రైతాంగం తీవ్రంగా నష్టపోతుంది. రాష్ట్ర విభజన చట్టం కాలపరిమితి త్వరలోనే ముగుస్తుంది. ఆ చట్టంలోని అంశాలను మరోసారి పార్లమెంటులో ప్రస్తావించాలి. వాటిని సాధించే ప్రయత్నం చేయాలి. ఇంకా అనేక అంశాలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని సాధించేందుకు చర్యలు చేపట్టాలి. అయిల్‌ఫాం సమస్యలను ప్రత్యేకంగా ప్రస్తావించాలి. రాష్ట్రంలో గతంలో ప్రభుత్వం ఆయిల్‌పాం సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహించింది. అయిల్‌పాంకు కనీస మద్దతు ధరను నిర్ణయించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలి' అని ఎంపీలకు కేసీఆర్ సూచించారు.

కేఆర్ఎంబీపై కేంద్ర మంత్రిని కలుస్తాం: హరీశ్

కృష్ణా నదిపై ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించే అంశంపై బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ప్రతినిధి బృందం కేంద్ర మంత్రిని కలుస్తుందని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. కేసీఆర్‌తో సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు అప్పగించడం సరికాదని, అప్పగిస్తే తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులను బోర్డుకు అప్పగిస్తూ సంతకాలు పెట్టిందని విమర్శించారు. కేంద్రం దీనికి సంబంధించిన మినిట్స్ కూడా బయట పెట్టిందని, కృష్ణా జలాల్లో మన వాటా తేలకుండా బోర్డుకు ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు. ఇప్పుడు ఆయా డ్యామ్‌లపైకి తెలంగాణ అధికారులు అడుగుపెట్టే అవకాశం లేకుండా పోయిందని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. గతంలోనూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తెలంగాణకు అన్యాయం చేశాయని, సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను పునరుద్ధరిస్తామని గతంలో అమిత్ షా హామీ ఇచ్చి మాట తప్పారని ఆరోపించారు. బీసీ జన గణన చేపట్టాలని పార్లమెంటులో గట్టిగా గొంతు వినిపిస్తామని తెలిపారు.

రాష్ట్ర ప్రయోజనాలపై దృష్టి పెట్టండి

ఎన్నికల హామీలు అమలు చేయాలని అడిగితే కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు సహనం కోల్పోతున్నారని హరీశ్‌రావు విమర్శించారు. ఉచ్చ ఆగడం లేదా? అని ఒకరు, చెప్పుతో కొడతామని మరొకరు అంటున్నారని, వారికి ప్రజలే గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. 'కాంగ్రెస్ నేతలు జర్నలిస్టులపైనా, ప్రతిపక్షాలపైనా అసహనం వ్యక్తం చేస్తున్నారు. మాపై బురద జల్లడం మాని రాష్ట్ర ప్రయోజనాలు కాపాడటంలో దృష్టి సారించండి. ఆరు గ్యారెంటీల్లోని 13 హామీల అమలుకు లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే జీవోలు ఇవ్వాలి. ఇంకా ప్రతిపక్షంలో ఉన్నట్టే దుందుడుకు స్వభావంతో మాట్లాడుతున్నారు. అహంకారం ప్రదర్శిస్తున్నారు. తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌పట్ల మీ భాష ఇలాగేనా ఉండేది? ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. మీకు గుణపాఠం చెప్తారు. మార్చి 17కి ప్రభుత్వానికి వంద రోజులు నిండుతాయి. అంతలోపు ఎన్నికల కోడ్ వస్తుంది. మహిళలకు ఒక్క హామీ అమలుచేసి అన్నీ ఇచ్చేశామంటే కుదరదు. ఎప్పటి నుంచి అమలు చేస్తారో స్పష్టంచేయాలి' అని డిమాండ్ చేశారు. విభజన హామీలపై పార్లమెంటులో కేంద్రాన్ని నిలదీస్తామని ఎంపీ రంజిత్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో పార్లమెంటరీ పార్టీ నేతలు కే కేశవరావు, నామా నాగేశ్వర్‌రావు, ఎంపీలు రాములు, బీబీ పాటిల్, పసునూరి దయాకర్, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, కేఆర్ సురేశ్‌రెడ్డి, వెంకటేశ్ నేత, బడుగుల లింగయ్య, వద్దిరాజు రవిచంద్ర, మాలోత్ కవిత, పార్థసారథిరెడ్డి, సంతోష్‌కుమార్, దీవకొండ దామోదర్‌రావు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

50 రోజులైనా 13 హామీల్లో రెండే అమలు • మాజీ స్పీకర్ మధుసూదనాచారి ఫైర్

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి విమర్శించారు. కాంగ్రెస్ చెప్పిన విధంగా 50 రోజుల సమయం పూర్తయ్యిందని, వారు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లోని 13 హామీల్లో కేవలం రెండింటిని మాత్రమే అమలు చేశారని శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అధికారమే లక్ష్యంగా ఇబ్బంది ముబ్బడిగా హామీలను ఇచ్చారని, వాటికి కావాల్సిన నిధులు, వాస్తవ పరిస్థితులు తెలుసుకోకుండా ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించారని విరుచుకుపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కదోవ పట్టించే విధంగా కాంగ్రెస్ నేతలు ఇష్టారీతిన మాట్లడుతున్నారని, తెలంగాణ సాధించిన కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలోనూ కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవెర్చడంలో విఫలమై అధికారానికి అనేక సంవత్సరాలు దూరమైందని.. అనేక రాష్ట్రాల్లో, కేంద్రంలో అదే పరిస్థితి ఉన్నదని చెప్పారు. హామీల అమలు విషయంలో తెలంగాణలోనూ అదే పరిస్థితి పునరావృతం అవుతుందన్నారు. కర్ణాటకలో హామీలు అమలు చేయలేక చేతులు ఎత్తేసారని గుర్తుచేశారు. తెలంగాణను అన్ని విధాలుగా అభివృద్ధి చేసింది, సంక్షేమ పథకాలు అమలు చేసింది కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఆదరించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టంచేశారు.

మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే కడియం తదితరులు

అధికార అహంతో రెచ్చిపోవద్దు

- ముఖ్యమంత్రి మాట్లాడే మాటలేనా?
- కావాలనే బీఆర్ఎస్‌ను బెదిరిస్తున్నారు
- బీజేపీ నాయకురాలిగా గవర్నర్ ప్రసంగం
- కాంగ్రెస్, గవర్నర్ తీరుపై ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫైర్

జనగామ, జనవరి 26 (నమస్తే తెలంగాణ): అధికారమే లక్ష్యంగా ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి గెలిచి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి, కొందరు మంత్రులు స్థాయి మరిచిపోయి అహంకారంతో రెచ్చిపోయి మాట్లాడుతున్నారని స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం జనగామలోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి నని మరిచిపోయి కేసీఆర్‌ను చార్లెస్ శోభరాజ్ అని, కేటీఆర్, హరీశ్‌రావును బిల్లా రంగా అంటూ బీఆర్ఎస్‌ను బెదిరించే ధోరణితో మాట్లాడుతున్నారని అన్నారు. 'శోభరాజ్, బిల్లారంగాల కన్నా నీ చరిత్ర గొప్పది రేవంత్? నువ్వు ఎన్ని కేసుల్లో ఉన్నావో తెలియదా?' అని వారు ప్రశ్నించారు. వివిధ డిక్లరేషన్ల ద్వారా 420 హామీలు ఇచ్చి వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చి 50 రోజులు దగ్గర పడుతున్న అంశాన్ని గుర్తుచేస్తే సీఎం, మంత్రులు ఎగిరెగిరి పడుతున్నారని అన్నారు. రైతులు బ్యాంకులకు వెళ్లి రూ.2 లక్షల పంట రుణం తీసుకోండి.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి సంతకం రుణమాఫీ ఫైల్‌పై పెడుతానని చెప్పినా.. ఈ రోజు వరకు రైతు బంధు పూర్తిగా రాని సంగతి ఏమైందని వారు ప్రశ్నించారు. నెపాన్ని బీఆర్ఎస్‌పై నెట్టాలని చూడటం సరికాదని అన్నారు. ఆర్థిక వ్యవస్థ అనుమతించని రీతిలో ఇచ్చిన 420 హామీలు, అత్యుత్సాహంతో ప్రకటించిన తేదీలను పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వరకు కాలయాపన చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. బీఆర్ఎస్‌ను వేధించడమే పనిగా పెట్టుకోకుండా ముందు హామీలను అమలుపై మేథోమథనం చేయాలని వారు సూచించారు. 'మీ బెదిరింపులకు మేం భయపడేది లేదు. అది జరగని పని' అని వారు పేర్కొన్నారు.

గవర్నర్ వ్యాఖ్యలు శోచనీయం..

గణతంత్ర దినోత్సవం సందర్భంగా గవర్నర్ తమిళిసై రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేలా బీజేపీ నాయకురాలిగా ప్రసంగించడం శోచనీయమని ఎమ్మెల్యేలు కడియం, పల్లా అన్నారు. గవర్నర్ అనే సంగతి, రాజ్యాంగ వ్యవస్థను కాపాడాలన్న విషయాన్ని మరిచిపోయి కాషాయ పార్టీ ప్రతినిధిగా గత ప్రభుత్వం గురించి ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడటం సరికాదని సూచించారు. ఏ ప్రభుత్వం ఉన్నా రాష్ట్రానికి గవర్నరే అధిపతి అన్న సంగతి ఆమె మరిచారని, గత ప్రభుత్వం చేసిన తప్పులకు, ఈ ప్రభుత్వం చేసే తప్పులకు గవర్నర్ బాధ్యులని, తప్పులు అంగీకరించడమంటే అది గవర్నర్ బలహీనత అన్న సంగతి తెలుసుకోవాలని హితవు పలికారు. గవర్నర్ వ్యాఖ్యలను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని, తెలంగాణ మేధావులు దీనిపై స్పందించాలని పిలుపునిచ్చారు. 'రాజ్యాంగ పరిరక్షణ గవర్నర్ బాధ్యత. కనీస పరిజ్ఞానం, రాజ్యాంగం పట్ల గౌరవం లేని వారిని తీసుకొచ్చి పదవిలో కూర్చోబెడితే ఇలాగే ఉంటుంది. ఇకపై ఇలాంటివి మానుకోవాలి' అని వారు గవర్నర్‌కు సూచించారు. గవర్నర్ కోటాలో కోదండరాంను ఎమ్మెల్సీగా అనుమతించిన గవర్నర్ దాసోజు శ్రవణ్ విషయంలో ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఇద్దరూ తెలంగాణ ఉద్యమకారులే, యూనివర్సిటీలో పనిచేసిన వారేనని, దాసోజు ఇంటలెక్చువల్ కాకుండా కోదండరాం ఎలా అయ్యారని ప్రశ్నించారు. ఈ విషయంలో కాంగ్రెస్, బీజేపీ మిలాఖత్ అయినట్టు అర్థమైందని, గవర్నర్ పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నట్టు వారు ఆరోపించారు.

ఎమ్మెల్యే పల్లా దంపతులపై కేసు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దంపతులపై రాచకొండ కమిషనరేట్ పరిధిలోని పోచారం ఠాణాలో శుక్రవారం భూకబ్జా కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ బీ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 796లో పీర్జాదిగూడ బుద్ధానగర్‌కు చెందిన ముచ్చర్ల రాధికతోపాటు మరికొంత మందికి 150 గజాల చొప్పున ప్లాట్లు ఉన్నాయి. అయితే తమ ప్లాట్లను కబ్జాచేసి, వాటి చుట్టూ ప్రహరీ నిర్మించుకున్నారని ఆరోపిస్తూ బాధితురాలు రాధికతోపాటు మరో 8 మంది ఈ నెల 23న పోచారం ఐటీసీ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు జనగామ ఎమ్మెల్యే, అనురాగ్ యూనివర్సిటీ చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సీఈవో సూర్యదేవర నీలిమ, గాయత్రి ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి మధుకర్‌రెడ్డి లపై 427, 447, 506సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్సీలపై గవర్నర్ రాజకీయం

- నాడు దాసోజు, సత్యనారాయణను తిరస్కరించి.. నేడు కోదండరాం అభ్యర్థిత్వాన్ని ఎలా ఆమోదించారు?
- వారికి రాజకీయ నేపథ్యం ఉందన్నారు.. నేడు పార్టీ అధ్యక్షుడినే ఎలా నియమిస్తారు?
- సీఎంకు మాత్రమే గవర్నర్ బాధ్యులు కాదు
- బీజేపీ, కాంగ్రెస్ బంధానికి నిదర్శనమిది
- ప్రజల సొమ్ము జీతంగా తీసుకొంటున్న గవర్నర్.. ప్రజలకు సమాధానం చెప్పాలి
- సర్పంచ్‌ల పదవీ కాలాన్ని పొడిగించాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

తెలంగాణభవన్‌లో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): నామినేటెడ్ ఎమ్మెల్సీల విషయంలో గవర్నర్ తీవ్రమైన పక్షపాతంతో నిర్ణయం తీసుకొన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించిన ఇద్దరి విషయంలో రాజకీయ సంబంధాలు ఉన్నాయని తిరస్కరించిన గవర్నర్, ఒక రాజకీయ పార్టీకి అధ్యక్షుడిగా ఉన్న కోదండరాంను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎలా నియమించారో చెప్పాలని డిమాండ్ చేశారు. గవర్నర్ తీరును ప్రజలు గమనిస్తున్నారని, వారికి సమాధానం చెప్పే తీరాలని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ఫెవికాల్ బంధంలో భాగంగానే ఇవన్నీ జరుగుతున్నాయని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని కేటీఆర్ ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా కొట్లాడిన దాసోజు శ్రవణ్, ఎరుకల సామాజికవర్గానికి చెందిన సత్యనారాయణను ఎమ్మెల్సీలుగా గత క్యాబినెట్ నామినేట్ చేస్తే, వారికి రాజకీయ సంబంధాలున్నాయని చెప్పి గవర్నర్ తిరస్కరించారు. ఈ రోజు వస్తున్న వార్తల ప్రకారం ఒక రాజకీయ పార్టీకి అధ్యక్షుడిగా ఉన్న కోదండరాం, మరొకరిని ఎమ్మెల్సీగా నామినేట్ చేస్తూ లేఖ రాగానే ఆగమేఘాల మీద ఆమోదించారు. శ్రవణ్, సత్యనారాయణకు రాజకీయ నేపథ్యం అడ్డంకి అయితే రాజకీయ పార్టీకి అధ్యక్షుడిగా ఉండి, ఎన్నికల్లో పోటీ చేసిన కోదండరాంను ఏ రకంగా ఆమోదించారో ప్రజలకు గవర్నర్ సమాధానం చెప్పాలి. రాష్ట్ర ప్రజలిచ్చే జీతంతో గవర్నర్ పనిచేస్తున్నారు. రాజ్‌భవన్ కూడా ప్రజల డబ్బుతోనే నడుస్తున్నదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. గవర్నర్ సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కరికే బాధ్యులు కాదు. రాష్ట్ర ప్రజలకీ బాధ్యులు అనే విషయం తెలుసుకోవాలి. ఆనాడు కనిపించిన రాజకీయ నేపథ్యం, ఈ రోజు ఎందుకు కనిపించడం లేదు? కాంగ్రెస్- బీజేపీ ఫెవికాల్ బంధం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారా? ఈ పరిణామం కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలను తెలియజేస్తున్నది' అని ఆరోపించారు.

కుసంస్కారంపై విమర్శలు తప్పవు

మంచి పదవిలో మంచి ముహూర్తాన సీట్లో కూర్చోబెట్టినంత మాత్రాన నీచ మానవులు బుద్ధి మార్చుకోరని, సీఎం రేవంత్‌రెడ్డి ఇదే విధంగా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. అదే అహంకారం, వెకిలితనం చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మేము ఇంకా అధికారపక్షమని, కాంగ్రెస్ ఇంకా ప్రతిపక్షంలో ఉన్నదని సీఎం అనుకొంటున్నారు. కాంగ్రెస్‌కు చేతనైతే ఇచ్చిన 420 హామీలను అమలుపర్చాలి. ఆరు గ్యారెంటీలను అమలుచేయాలి. రాజకీయాల్లో ఇలాంటి కుసంస్కారులు ఉన్నప్పుడు ఇలాంటి విమర్శలు తప్పవు. కాంగ్రెస్ హామీల నుంచి ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నాల్లో భాగంగానే ఈ విధంగా చేస్తున్నారు. ఎన్ని చేసినా కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేదాకా వెంటాడుతాం' అని స్పష్టంచేశారు.

సర్పంచ్‌ల పదవీకాలం పొడిగించాలి

ప్రజాపాలన ప్రజల చేత ఎన్నికైన ప్రజాప్రతినిధులు చేయాలి కానీ, ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారులు కాదని కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో సర్పంచ్‌ల పదవీకాలం ముగుస్తున్నందున తిరిగి ఎన్నికలు జరిగేవరకు వారినే సర్పంచ్‌లుగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో సర్పంచ్‌లు రెండేండ్లు పనిచేయలేకపోయారని, కాబట్టి వారి పదవీకాలాన్ని తిరిగి ఎన్నికలు నిర్వహించేవరకు పొడిగించాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గత సర్పంచ్‌ల పదవీకాలం ముగియగానే వెంటనే ఎన్నికలు నిర్వహించిందని గుర్తు చేశారు. ప్రస్తుత సర్పంచ్‌ల హయాంలో నిర్మించిన భవనాల ప్రారంభోత్సవాలను కుంటిసాకులతో ప్రభుత్వం అడ్డుకొంటున్నదని ఆరోపించారు. ఆ భవనాలను వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాతీయ జెండా ఎగురవేసిన తరువాత మాజీ మంత్రి మహముద్ అలీ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. కండ్లు తిరిగి కిందపడిపోతుండగా పార్టీ నాయకులు ఆయనను పట్టుకొని ప్రాథమిక చికిత్స అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు నాగం జనార్ధన్ రెడ్డి, పోన్నాల లక్ష్మయ్య, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, దానం నాగేందర్, కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు

బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు పాడి కౌశిక్‌రెడ్డి, కడియం శ్రీహరి ఎమ్మెల్సీ పదవులకు ఒకేసారి రాజీనామా చేస్తే ఒకే బ్యాలెట్ పేపర్‌పై ఒకేసారి ఎన్నిక జరగాల్సి ఉండగా, రెండు వేర్వేరు ఎన్నికలు ఎలా నిర్వహించారని కేటీఆర్ ప్రశ్నించారు. అలా చేసినందువల్లనే రెండు ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌కు దక్కాయని ఆరోపించారు. వాస్తవంగా అందులో ఒకటి బీఆర్ఎస్‌కు రావాల్సి ఉండెనని తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీని కలవగానే ఎమ్మెల్సీలకు వేర్వేరుగా ఎన్నికలు జరిగాయని గుర్తుచేశారు. ఇదంతా బీఆర్ఎస్‌ను ఖతం చేయాలని బీజేపీ, కాంగ్రెస్ చేస్తున్న కుట్ర అని ఆరోపించారు. కాంగ్రెస్‌కు జాకీలు పెట్టి నిలిపే ప్రయత్నం జరుగుతున్నదని, దానికి బీజేపీ మద్దతుగా నిలుస్తున్నదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ – బీజేపీది ఫెవికాల్ బంధమని ప్రజలకు తెలుసని, బీజేపీ నేత బండి సంజయ్ కూడా ఇటీవల కాంగ్రెస్, బీజేపీ కొట్లాడుకోవద్దు, బీఆర్ఎస్ అంతం చూద్దామని పిలుపునిచ్చారని గుర్తుచేశారు. గంపు మేస్త్రీ కూడా ఇదే మాట చెప్పారని అన్నారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు

- ఫిర్యాదుదారులను నేను ఏనాడూ కలిసిన దాఖలాలు లేవు
- ఎక్కడ, ఎప్పుడు దూషించానో ఎఫ్ఐఆర్‌లో పేర్కొనలేదు
- ఆ భూమి నాదేనని జిల్లా కలెక్టర్, తాసిల్దార్ ధ్రువీకరించారు
- చోటా నయీంగా తీన్మార్ మల్లన్న
- జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆగ్రహం

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జనవరి 26 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం తనపై పెట్టే అక్రమ, తప్పుడు కేసులకు భయపడే ప్రసక్తేలేదని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. భూమి విషయంలో తమను దుర్భాషలాడారంటూ ఆయనతోపాటు పలువురి మీద పోచారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావడంపై పల్లా స్పందించారు. అసలు ఫిర్యాదుదారులు ఎవరో తనకు తెలియదని, వారి ముఖం చూసిన, వారిని కలిసిన దాఖలాలు లేవని వెల్లడించారు. వాస్తవానికి ఫిర్యాదు వస్తే అసలు వారిని తాము ఎక్కడ కలిశాం? ఎప్పుడు వారితో మాట్లాడాం? ఏ సందర్భంగా దుర్భాషలాడాం? అనే కనీస వివరాలు ఉండాలని... ఇవేవీ లేకుండానే పోలీసులు కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. ఏమాత్రం విచారణ లేకుండా ఉద్దేశపూర్వకంగా పెట్టిన తప్పుడు కేసు అని అర్థమవుతున్నదని చెప్పారు. ఏడున్నర ఎకరాల భూమిని గాయత్రి ఎడ్యుకేషన్ ట్రస్టు పేరిట చట్టపరంగా కొనుగోలు చేశామని, అనంతరం నిబంధనల ప్రకారం మ్యుటేషన్ కూడా చేయించుకున్నామని వెల్లడించారు. తదనంతరం జరిగిన పరిణామాల్లో సంబంధిత జిల్లా కలెక్టర్, తాసిల్దార్ ఇది ట్రస్టుకు చెందిన భూమి అని, కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా ఉన్నదని ఎన్‌వోసీ కూడా ఇచ్చారని పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. అయినప్పటికీ తీన్మార్ మల్లన్న వెనక ఉండి కొందరితో కుట్రపూరితంగా ఈ ఫిర్యాదులు చేయిస్తున్నారని, పోలీసులు సైతం ఏమాత్రం విచారణ చేయకుండా కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. తీన్మార్ మల్లన్న ఓ చోటా నయీంలా అవతారమెత్తుతున్నారని పల్లా ఆరోపించారు. తానుగానీ.. తన భార్యకానీ ఈ భూ వ్యవహారంలో ఎవరినీ కలువలేదని, ఎవరినీ దుర్భాషలాడలేదని పల్లా స్పష్టం చేశారు. ఒకవేళ ఫిర్యాదుదారులు నిజంగానే భూమి నష్టపోతే న్యాయపరంగా కోర్టుకు వెళ్లాలి కానీ వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసేలా సివిల్ తగాదాలపై పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెట్టడం సరికాదని పేర్కొన్నారు. ఈ వ్యవహారాన్ని న్యాయపరంగా ఎదుర్కొంటామని తెలిపారు. 25 ఏండ్ల క్రితమే అక్కడ విద్యాసంస్థను స్థాపించామని, నాటి నుంచి నేటి వరకు కూడా భూములకు సంబంధించిన అన్ని రకాల కార్యకలాపాలు చట్టపరిధిలోనే జరిగాయని, వాటికి సంబంధించి అన్నిరకాల అనుమతులు అంతకుముందున్న కాంగ్రెస్ ప్రభుత్వం నుంచే ఉన్నాయని వివరించారు.

కేసు పెట్టించేందుకే సీఐ మార్పు

వాస్తవానికి ఎప్పటినుంచో తనపై కేసు పెట్టించేందుకు తీన్మార్ మల్లన్న, ఇతరులు ప్రయత్నిస్తున్నారని, కానీ గతంలో ఉన్న ఇన్‌స్పెక్టర్ ఇలాంటి తప్పుడు కేసులు పెట్టేందుకు నిరాకరించారని పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. దీంతో సదరు ఇన్‌స్పెక్టర్‌పై చాలారోజులు వివిధ మార్గాల్లో ఒత్తిడి కూడా చేశారని, చివరికి ఆయన్ని అక్కడి నుంచి బదిలీ చేసి... మరొకరిని తీసుకువచ్చి ఇప్పుడు తనపై కేసు పెట్టించారని చెప్పారు. ఇలాంటి కేసులకు భయపడేది లేదన్న ఆయన... చట్టపరంగా, న్యాయపరంగానే ఈ వ్యవహారాన్ని తాను ఎదుర్కొంటానని స్పష్టం చేశారు.

లోకం పోకడ



పిల్లల్లో స్క్రీన్ టైమ్ తగ్గించడం ఎలా?

తల్లిదండ్రులకు ఆదివారం ఉచిత ఆన్‌లైన్ సెషన్

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): రోజూ గంటల తరబడి మొబైల్ ఫోన్లు, టీవీలు, కంప్యూటర్లకు అతుక్కుపోతున్న పిల్లల్లో స్క్రీన్ టైమ్ తగ్గించడం ఎలా? అనే అంశంపై తల్లిదండ్రులకు ఉచితంగా ఆన్‌లైన్ సెషన్ నిర్వహించనున్నట్టు వన్ లైఫ్ కౌన్సెలింగ్ సైకాలజిస్టు రెబెక్కా మారియా వెల్లడించారు. ఆదివారం (28వ తేదీ) ఉదయం 11 గంటల నుంచి ఈ సెషన్ కొనసాగుతుందని, ఆసక్తి ఉన్న తల్లిదండ్రులు 8555940650 ఫోన్ నంబర్‌ను సంప్రదించి పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	8.2°c	31.8°c
మెదక్	14.0°c	31.6°c
రంగారెడ్డి	14.4°c	32.8°c
నిజామాబాద్	16.7°c	29.3°c
కరీంనగర్	18.0°c	30.0°c
వరంగల్	18.0°c	30.0°c
నల్లగొండ	18.0°c	30.0°c
హైదరాబాద్	18.9°c	30.4°c
మహబూబ్‌నగర్	20.3°c	33.0°c
ఖమ్మం	21.0°c	34.0°c

నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌సీఈఆర్‌టీఈలో...

**నేషనల్ కౌన్స